క్లుప్తంగా

దుస్తులను సకాలంలో అందించాలి



బాల్కొండ: విద్యార్థులకు దుస్తులను సకాలంలో అందించాలని ఏపీడీ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో, కిసాన్‌నగర్‌లో మహిళస మాఖ్యల ఆధ్వర్యంలో యూనిఫాంలు కుడుతున్న కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభం లోగా దుస్తులను అందించాలన్నారు. ఆయన వెంట డీపీఎం సాయిలు, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఏపీఎం గంగాధర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు చౌడేశ్వరి దేవి ఆలయ ఉత్సవాలు



రుద్రూర్: మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి ఆలయ ఉత్సవాలు బుధ, గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది వైశాఖ మాసంలో నెల రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ రెండు రోజులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, శోభాయాత్ర ఉంటాయని పేర్కొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌ల తనిఖీ

బోధన్‌టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లి, గోషాల, బస్వతారక్ నగర్, రాకాసీపేట్, సరస్వతినగర్ కాలనీల్లో ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను, ల్యాబ్‌లను వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది మంగళవారం తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారనే నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సెంటర్లలో ప్రజలకు అందిస్తున్న సేవలు, రక్త పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నివేదికను తయారు జిల్లా వైద్యాధికారికి అందిస్తామని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ విద్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



వేల్పూర్: మండలం లక్కోర వద్ద 63 నంబరు జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సిరిసిల్ల జిల్లా మానాలకు చెందిన గంగనర్సయ్య, గంభీర్‌పూర్‌కు చెందిన రమేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆర్మూర్‌లోని బంధువుల ఇంటికి వచ్చారు. రాత్రి సమయంలో తిరిగి మానాలకు వెళ్తుండగా లక్కోర వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న రమేశ్‌తోపాటు వెనుక కూర్చున్న గంగనర్సయ్యకు తీవ్రగాయాలుకాగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆర్మూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చందాలు వేసి అంత్యక్రియలు

మాక్లూర్: మండలంలోని మానిక్‌బండార్‌కు చెందిన వీరేశం(55) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. వీరేశం సీస కమ్మరి వృత్తి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. పేదరికం కావడంతో దహ న సంస్కారాలకు డబ్బులు లేక మృతుడి భార్య తల్లడిల్లింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చందాలు వేసి అంత్యక్రియలు నిర్వహించారు.

బీజేపీకి జై కొట్టిన బాల్కొండ ఓటరు

- 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి బాటలు
- పార్లమెంట్ ఎన్నికలు వచ్చే సరికి బీజేపీకి ప్రాధాన్యం



మోర్తాడ్(బాల్కొండ): బాల్కొండ ఓటర్లు మరోసారి తమ విలక్షణతను చాటుకున్నారు. ఆరు నెలల కింద జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి బాటలు వేసిన ఓటర్లు పార్లమెంట్ ఎన్నికలు వచ్చే సరికి తమ మూడ్‌ను మార్చుకున్నట్లు స్పష్టమవుతోంది. బాల్కొండ నియోజకవర్గంలో 1,69,550 ఓట్లు పోలవ్వగా బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు 85,845 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి 53,673 ఓట్లు దక్కాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డికి 70,417 ఓట్లు లభిస్తే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అదే పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు కేవలం 19,643 ఓట్లు మాత్రమే వచ్చాయి. గతంలో కంటే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 50,774 ఓట్లు తక్కువ లభించడం పరిశీలిస్తే బాల్కొండ ఓటరు నాడి అంతుచిక్కకుండా ఉందని వెల్లడవుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి 53,673 ఓట్లు లభించాయి. అప్పట్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన సునీల్‌రెడ్డికి 65,884 ఓట్లు లభించగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 12,211 ఓట్లు కోత పడ్డాయి.

బోధన్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యత

- కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ
- బీజేపీకి గణనీయంగా పెరిగిన ఓట్లు

బోధన్: బోధన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత చాటింది. నియోజకవర్గం పరిధిలోని బోధన్ అర్బన్, రూరల్, సాలూర, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల్లో 246 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 2 లక్ష 23 వేల 96 వేలు, ఇందులో 1,66,376 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు 69,472 ఓట్లు రాగా, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డికి 82 ,666 ఓట్లు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు 7వేల 742 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ 13,194 ఓట్ల ఆధిక్యత సాధించింది. ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నీ తానై ప్రచారం నిర్వహించారు. మరోసారి నియోజకవర్గంపై సుదర్శన్ రెడ్డి పట్టు నిరూపితమైంది. కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ప్రధాన పోటీ జరిగిందనేది తేటతెల్లమైంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల కంటే కూడా కాంగ్రెస్, బీజేపీలకు గణనీయంగా ఓట్లు పెరిగాయి. నామమాత్రపు ఓట్లతో బీఆర్ఎస్ మూడో స్థానంలో నిలిచింది.

ఆ రెండు పార్టీలకు పెరిగిన ఓట్లు ..

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి 66,433, బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్‌కు 63,664, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహన్‌రెడ్డికి 33,234 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీ 2,769 ఓట్ల స్వల్ప అధిక్యత సాధించింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 82,666 ఓట్లు రావడంతో 16,233 ఓట్లు పెరిగాయి. బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల కంటే 36, 238 ఓట్లు అధికంగా పోలయ్యాయి. బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే 55,922 ఓట్లు కోల్పోయింది. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో ఆధిక్యత చాటినప్పటికి పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి పరాజయం ఆ పార్టీ శ్రేణుల్లో నిరాశకు గురిచేసింది.

అర్వింద్ విజయంలో ఆర్మూర్ ఓటర్ల ప్రత్యేక పాత్ర

- 2019 ఎన్నికల్లో బీజేపీకి 32 వేలకు పైగా మెజారిటీ
- ప్రస్తుత ఎన్నికల్లో 28,669 ఓట్ల మెజారిటీ

ఆర్మూర్: నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి. ధర్మపురి అర్వింద్ వరసగా రెండో పర్యాయం విజయం సాధించడంలో ఆర్మూర్ ఓటర్ల పాత్ర కీలకంగా మారింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ మొదటిసారి పోటీలో నిలవగా 70,875 ఓట్ల మెజారిటీతో తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కల్వకుంట్ల కవితపై విజయం సాధించారు. అయితే ఈ ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచే బీజేపీ అభ్యర్థికి 32 వేలకు పైగా ఓట్ల మెజారిటీ వచ్చింది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో సైతం ఆర్మూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు 83,668 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డికి 54,999 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు 8,312 ఓట్లు మాత్రమే వచ్చాయి. అర్వింద్ విజయంలో ఈ ఓట్లు కీలకంగా మారాయి.

ఇందూరు చరిత్రలో వరసగా రెండో విజయం..

2019 ఎన్నికల్లో బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని మొదటిసారి కైవసం చేసుకొని రికార్డు సృష్టించింది. తాజాగా ప్రస్తుత ఎన్నికల్లో వరసగా రెండో పర్యాయం విజయం సాధించి బీజేపీ తన స్థానాన్ని పదిలం చేసుకుంది. 1956 నుంచి 2024 వరకు నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి 18 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. వీటిలో 2019 ఎన్నికలు దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం విదితమే. ఆ ఎన్నికల్లో పోటీలో ఉన్న 185 మంది అభ్యర్థుల్లో 176 మంది రైతులు పసుపు బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉండటంతో రైతులందరికీ కలిపి 98 వేలకుపైగా ఓట్లు రావడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రైతులు సాధించిన ఈ ఓట్ల సంఖ్య పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములను తారుమారు చేసింది. కానీ ఆర్మూర్ కేంద్రంగా ఎగసిన రైతుల ఉద్యమం ఫలితంగా 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ విజయం సాధించడంతో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ చరిత్రను తిరగరాసినట్లయింది.

పలు గ్రామాల్లో భారీ వర్షం



రెంజర్లలో కురుస్తున్న వర్షం

ఆర్మూర్‌టౌన్/ బాల్కొండ: ఆర్మూర్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పలు వీధులు వర్షపు నీటితో జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలిదూమారంతో పలు వార్డుల్లో ఇంటిపై కప్పుల రేకులు నేలకొరిగాయి. వీధి వ్యాపారుల వస్తువులు, ఫ్లెక్సీలు రోడ్డున పడ్డాయి. అంతర్గత రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముప్కాల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జల మయమయ్యాయి. విత్తన సాగుకు అనువైన వర్షం కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పంట భూముల్లో నిలిచిన వర్షపు నీరు



ఆర్మూర్‌లో కురుస్తున్న వర్షం



రోడ్లపై చేరిన నీరు

రాకపోకలకు ఇబ్బందులు

రెంజల్: నవీపేట్–కందకుర్తి ప్రధాన రహదారిపై వీరన్నగుట్ట సమీపంలో నరికిన చెట్ల కొమ్మ లను రోడ్డుకు అడ్డంగా పారవేయడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. హరిత హారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు పెరిగి చెట్లుగా ఎదిగాయి. విద్యుత్ తీగలకు తగలి కరెంట్ సమస్య ఎదురవడంతో రెండు రోజుల క్రితం ట్రాన్స్‌కో సిబ్బంది చెట్ల కొమ్మలను నరికివేసి రోడ్డుపై వదిలిపెట్టారు. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.



రోడ్డు పక్కన పారవేసిన చెట్ల కొమ్మలు

ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు చెట్ల కొమ్మలను తీసివేయించాలని వీరన్నగుట్ట ఎంపీటీసీ సభ్యురాలు గంగాలత కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న అమ్మవారి ఆలయ నిర్మాణానికి ముప్కాల్ జెడ్పీటీసీ బద్దం నర్సవ్వనర్సారెడ్డి దంపతులు రూ. 5 వేల116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారిని అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విజయ్, కంచు గంగాధర్, భూమన్న, చిన్న రాజన్న పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



రెంజల్‌లో పటాకులు కాలుస్తున్న నాయకులు



బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లిలో నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు



కమ్మర్‌పల్లిలో భరతమాత విగ్రహానికి పూలమాల వేస్తూ..

సాక్షి, నెట్‌వర్క్: కేంద్రంలో బీజేపీ, జిల్లాలో పార్టీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ రెండోసారి గెలవడంపై ఆర్మూర్, బాల్కొండ, నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద పార్టీ నాయకులు పటాకులు కాల్చారు. అనంతరం కింది బజార్, పెద్దబజార్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. బోధన్ ఉమ్మడి మండలంలో బీజేపీ నాయకులు సంబురాలు చేపట్టారు. సాలూర మండల కేంద్రంలో, ఎరాజ్‌పల్లి గ్రామంలో పార్టీ నాయకులు పటాకులు కాల్చి నినాదాలు చేశారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు గెలుపు సంబురాలు నిర్వహించారు. స్థానిక భరతమాత విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ విజయం సాధించడంతో బోధన్‌లోని బీజేపీ నాయకులు సంబురాలు చేపట్టారు. ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ గెలుపుపై నృత్యాలు చేశారు. నందిపేట్ మండల కేంద్రంలో పార్టీ నాయకులు అర్వింద్ గెలుపుపై సంబురాలు నిర్వహించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. రెంజల్ మండలంలోని రెంజల్, సాటాపూర్, కళ్యాపూర్, తాడ్‌బిలోలి, దూపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబురాలను నిర్వహించారు. ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. వేల్పూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద పార్టీ నాయకులు పటాకులు కాల్చి సంబురాలు చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎడపల్లి మండలం ఠాణాకలాన్‌లో నృత్యాలు చేస్తున్న నాయకులు



వేల్పూర్‌లో..



బోధన్ పట్టణంలో నినాదాలు చేస్తున్న నాయకులు



సాలూర మండల కేంద్రంలో..



ఠాణాకలాన్‌లో..



నందిపేట్‌లో పటాకులు కాల్చి నినాదాలు చేస్తున్న నాయకులు

అర్వింద్ విజయంతో మరిన్ని నిధులు

- ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ సుచరితరెడ్డి

ఆర్మూర్: ఎంపీగా గెలుపొందిన ధర్మపురి అర్వింద్‌తో కేంద్రం నుంచి మరిన్ని నిధులు రాబట్టుకొని ఈ ప్రాంతం అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఏర్పడిందని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి కుమార్తె, ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచరితరెడ్డి అన్నారు. నిజామాబాద్ ఎంపీగా రెండోసారి విజయం సాధించిన అర్వింద్ నివాసానికి ఆమె మంగళవారం వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అవినీతి మచ్చలేని అర్వింద్ గెలవడం సంతోషకరమని అన్నారు.



అర్వింద్ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సుచరిత రెడ్డి

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



రుద్రూర్: జహీరాబాద్ ఎంపీగా సురేశ్ షెట్కార్ విజయం సాధించడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పటాకులు కాల్చి సంబురాలు చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, నడిపింటి నగేశ్, మాశెట్టి శ్రీనివాస్, రాంబాబు, కర్కె అశోక్, అత్కురి మహేశ్, పార్వతీప్రవీణ్, అడ్డ సాయిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)


స్క్రీన్-1 –	లవ్‌మీ (తెలుగు) – 12.05, 6.15 ఫ్యూరియోసా (తెలుగు) – 3.00 హిట్‌లిస్ట్ (తెలుగు) – 9.10
స్క్రీన్-2 –	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) – 10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3 –	గంగం గణేశా (తెలుగు) – 12.15, 3.20, 6.25, 9.30
స్క్రీన్-4 –	భజే వాయువేగం – 10.35, 1.30, 4.25, 7.20, 10.15

శిథిలావస్థలో పశువుల ఆస్పత్రి



రుద్రూర్ పశువుల ఆస్పత్రి

రుద్రూర్: మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రి శిథిలావస్థకు చేరింది. భవనం పైపెచ్చులూడి పోతోంది. వర్షాకాలంలో గోడలు తడిసి ఆస్పత్రిలో ఉన్న మందులు పాడవుతున్నాయి. దీంతో కార్యాలయాల సిబ్బంది, పశువులకు చికిత్స చేయించేందుకు వచ్చే రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఏ క్షణంలో పెచ్చులూడి పడుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాన్ని సుమారు 40ఏళ్ల క్రితం నిర్మించారు. మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్, బొప్పాపూర్, చిక్కడపల్లి, రాణంపల్లి, అంబం(ఆర్) గ్రామాల నుంచి మూగ జీవాలను చికిత్స నిమిత్తం తీసుకొస్తారు.



పెచ్చులూడిన ప్రాంతం

వేల సంఖ్యలో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు ఈ ప్రాంతాల్లో ఉన్నాయి. భవనం శిథిలావస్థకు చేరడంతో జీవాల పెంపకం దారులు ఈ పశువుల ఆస్పత్రికి తీసుకు రావాలంటే జంకుతున్నారు. ఆసుపత్రిని ఆధునికరించాలని పాడి రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల వెటర్నరీ డాక్టర్ సంతోష్‌రెడ్డిని సంప్రదించగా.. ఆస్పత్రి శిథిలావస్థకు చేరిన విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసకొత్తూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులందరూ ఒకే చోట కలవడంతో నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. సమ్మేళనంలో గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

